క్లుప్తంగా

ఉచిత రేషన్ పంపిణీ నిలిపివేస్తే కేసులు



సమావేశంలో పాల్గొన్న రేషన్ డీలర్లు

రామభద్రపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంపిణీ చేస్తున్న ఉచిత (రేషన్)బియ్యం పంపిణీ నిలిపివేస్తే 6–ఏ కింద కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ సుబ్బారావు, సీఎస్‌డీటీ సాయికృష్ణ హెచ్చరించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, రేషన్ పంపిణీ చేసే వాహనదారులతో సమావేశమైన వారు గత కొన్ని నెలలుగా పలువురు రేషన్ డీలర్ల వద్ద క్వింటాళ్ల కొలది బియ్యం ఓబీ ఉంటుందని, ఆ బియ్యాన్ని వచ్చే నెల పంపిణీ సమయానికి సర్దుబాటు చేసుకోకపోతే ఇబ్బంది పడతారని తెలిపారు. మార్చి నెలలో తనిఖీలు ముమ్మరం చేస్తామని, ఎవరిదగ్గరైనా ఉన్న స్టాకులో తేడాలు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థికి అభినందనలు



రాకేష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీఈటీ

వంగర: మండల కేంద్రంలోని ఆర్‌సీఎం స్కూల్‌కు చెందిన విద్యార్థి శాసపు రాకేష్ జాతీయ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు నరసారావుపేటలో ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–14 వాలీబాల్ పోటీల్లో రాకేష్ ప్రతిభ కనబరిచి, జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని పీఈటీ అరసాడ కృష్ణ తెలిపారు. ఈ మేరకు విద్యార్థిని ప్రిన్సిపాల్ డి. క్రీస్తుమణి, తదితరులు శనివారం అభినందించారు.

అలసత్వం తగదు



కింజంగి సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

వంగర: విధి నిర్వహణలో అలసత్వం తగదని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు హెచ్చరించారు. మండల పరిధిలోని కింజంగి సచివాలయాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల హాజరు, ఇతర రికార్డులను పరిశీలించారు. గ్రీవెన్స్‌సెల్‌కు వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించాలని సూచించారు.

పోలిపల్లి ఆలయ హుండీ ఆదాయం రూ. 84 వేలు



ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

రాజాం సిటీ: పోలిపల్లి పైడితల్లి అమ్మవారి హుండీ కానుకలను శనివారం లెక్కించారు. 25 రోజులకు గాను 84,860 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఈఓ బీవీ మాధవరావు తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ పీవీ లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన లెక్కింపులో ఆలయ ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్, అర్చకుడు వేమకోటి సూర్యనారాయణశర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో 'గ్రీన్‌డే'



గ్రీన్‌డే కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి తదితరులు

తెర్లాం: మండల కేంద్రమైన తెర్లాంతో పాటు పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీఓ కె.రాజ్యలక్ష్మి ఆదేశాల మేరకు గ్రీన్ డే కార్యక్రమం శనివారం నిర్వహించారు. తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పచ్చదనం గురించి, ఆకుకూరలు, కాయగూరలు, చెట్లు, వస్తువుల గురించి, ప్రీస్కూల్ విద్యార్థులకు తెలిపారు.

కొలతల ప్రకారం ఉపాధి పనులు

రాజాం: కొలతల ప్రకారం ఉపాధి పనులు చేయాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు వేతనదారులకు సూచించారు. మండలంలోని ఒమ్మి, రాజయ్యపేట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రెండు పూటలా నిర్ణీత కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు 250 రూపాయల వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు.

గృహ సారథులే..గెలుపు వారథులు

- ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలి
- వలంటీర్లతో సమన్వయంగా వ్యవహరించాలి
- గృహసారథుల సమావేశంలో ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్



గృహసారథులకు కిట్లు అందిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, తదితరులు

రాజాం: గృహ సారథులే గెలుపు వారథులని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలోని సూర్యదుర్గా కల్యాణ మంటపంలో గృహ సారథులతో శనివారం సమావేశం నిర్వహించారు. రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులతో కలసి సమావేశానికి హాజరైన ఎంపీ బెల్లాన మాట్లాడుతూ, ఈ నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఎంతో చేసిందని తెలిపారు. ప్రతీ ఇంటికి వెళ్లి గత ప్రభుత్వంలో జరిగిన అన్యాయాన్ని వివరించడంతో పాటు ఈ ప్రభుత్వం హయాంలో పొందిన లబ్ధిని వివరించాలని సూచించారు. వలంటీర్లతో పాటు గ్రామ సచివాలయ కన్వీనర్లను సమన్వయం చేసుకుంటూ ప్రతి నెలలో 8 రోజులు పాటు ' మా నమ్మకం నువ్వు జగన్' కార్యక్రమం చేపట్టాలన్నారు. ఒక్కో గృహ సారథి ప్రతి రోజూ 15 నుంచి 18 ఇళ్లను సందర్శించాలని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రజల పక్షపాతని, ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చారని చెప్పారు. ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి న్యోహన్‌రెడ్డి విజన్ ఉన్న నాయకుడని, ఈ నాలుగేళ్లలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. గృహసారథులు రానున్న ఎన్నికల్లో గెలుపు వారథులుగా మారాలని కోరారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ, పత్తా లేని టీడీపీని ఎత్తేందుకు కొన్ని పత్రికలు, చానల్లు తప్పుడు ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. గృహసారథులు, సోషల్ మీడియా కో ఆర్డినేటర్లు వాటిని తిప్పికొట్టాలని సూచించారు. అనంతరం సమావేశానికి హాజరైన 420 మంది గృహసారథులకు మా నమ్మకం నువ్వే జగన్ కిట్లు పంపిణీ చేశారు.

ఎమ్మెల్సీని గెలిపించుకోవాలి..

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో వైఎస్సార్ సీపీ మద్దతుతో నిలిచిన సీతంరాజు సుధాకర్‌ను గెలిపించుకోవాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కోరారు. ఈ మేరకు ఎన్నికకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాజాం కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, పొట్నూరు లక్ష్మణరావు, దూబ గోపాలం, వంజరాపు విజయ్‌కుమార్, శాసపు వేణుగోపాలనాయుడు, నల్లా శ్రీనివాసరావు, సచివాలయాల పట్టణ కన్వీనర్ కొయ్యాన సత్యనారాయణ, సత్యనారాయణపురం సచివాలయ కన్వీనర్ గొర్లె సుమలత, తోట తిరుమలరావు, జేసీబీ శ్రీను, ఓలేటి గణపతి, ఎ. వెంకటనాయుడు, కొల్ల రమ్య, అల్లెన జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం..

వంగర: అన్ని వర్గాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని మద్దువలస గ్రామంలో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంపై మండల జేసీఎస్ కన్వీనర్ మరిశర్ల విజయలక్ష్మి అధ్యక్షతన సచివాలయ కన్వీనర్లు, గృహసారతులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. టీడీపీ, ఎల్లోమీడియా చేస్తున్న దుష్ప్రచారాలను శ్రేణులంతా తిప్పికొట్టాలని తెలిపారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శన రావు, వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు, పార్టీ నాయకులు కనగల పారినాయుడు, బొక్కేల వెంకటప్పలనాయుడు, బొంతు వెంకటరావు, కాంబోతుల భగవతి, శనపతి సత్యారావు, నెయిగాపుల శివరామకృష్ణయ్య, వేమిరెడ్డి సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

షిర్డీసాయి ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



షిర్డీ సాయి ఆలయంలో ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, తదితరులు

రేగిడి: మండలంలోని కొమెర గ్రామంలో నూతనంగా నిర్మించిన విద్యా గణపతి జ్ఞాన సరస్వతీ సహిత షిర్డీసాయి మందిరాన్ని రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కోటి రూపాయలతో గ్రామస్తులు ఆలయాన్ని నిర్మించుకోవడం ఆనందించదగ్గ విషయమన్నారు. మానసిక ప్రశాంతతకు ఆధ్యాత్మికత ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, సర్పంచ్ పాడి లక్ష్మునాయుడు, కెంబూరు నారాయణరావు, పాడి మధుసూదనరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



చిన్నారికి వ్యాధి నిరోధక టీకా వేస్తున్న ఏఎన్‌ఎంలు ప్రశాంతి, ప్రభావతి

తెర్లాం: చిన్నారులకు ఎటువంటి వ్యాధులు సోకకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి దీక్షితారాణి సూచించారు. శనివారం స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని సచివాలయాల్లో స్పెషల్ వ్యాక్సినేషన్ డ్రైవ్ నిర్వహించి, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం

- సీనియర్ సివిల్ జడ్జి బాబు



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబు

రాజాం సిటీ: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు అన్నారు. శనివారం స్థానిక నారాయణ పాఠశాలలో న్యాయసేవాధికార సంఘం ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యాహక్కు చట్టం ద్వారా 6 – 14 సంవత్సరాల మధ్య వయసు గల పిల్లలకు ఉచిత విద్య అందుబాటులో ఉందన్నారు. విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, జీవితంలో ఎన్నో విషయాలు ఈ వయసులోనే తెలుసుకోవచ్చని చెప్పారు. యువత సన్మార్గాన్ని అనుసరించి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, న్యాయవాదులు రెడ్డి విజయ్‌కుమార్, ముదిలి శ్రీనివాసరావు, ఎస్సై వీబీ రామకృష్ణ, ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డు

రేగిడి: గ్రామాల్లో చేస్తున్న ఉపాధి హామీ పనులకు సంబంధించి ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డు అందజేసినట్లు ఎంపీడీఓ జి. కాశీవిశ్వనాథరావు అన్నారు. మండలంలోని తోకలవలస, లచ్చన్నవలస గ్రామాల్లో జరుగుతున్న చెరువు పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాబ్‌కార్డు ఉన్నవారు మాత్రమే ఉపాధి పనులకు రావాలని, కార్డులు లేకపోతే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రెండు పూటలా పనులు చేస్తే వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు.

నోడల్ ఆధార్ కేంద్రాల సేవలపై అవగాహన



సూచనలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: మండలంలోని పెరుమాళి, నెమలాం గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన నోడల్ ఆధార్ కేంద్రాల సేవలపై అవగాహన కల్పించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లతో శనివారం సమావేశమైన ఆయన సచివాలయాల వారీగా అందిస్తున్న ఈ–సర్వీసుల సంఖ్యను మరింత పెంచాలని కోరారు. నోడల్ ఆధార్ కేంద్రాల్లో ఐదేళ్లలోపు చిన్నారుల ఆధార్‌కార్డులు చేయడం జరుగుతుందన్నారు. రైస్‌కార్డులో మార్పులు, చేర్పులపై కూడా అవగాహన కల్పించాలన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



సర్వేయర్లకు సూచనలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

తెర్లాం: విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న భూముల రీసర్వేను శనివారం పరిశీలించిన ఆయన సర్వేలో పాల్గొంటున్న సచివాలయ సర్వేయర్లు, వీఆర్‌ఓలు విధులను నిర్లక్ష్యం చేయకుండా, పక్కాగా సర్వే పూర్తి చేయాలని సూచించారు. సరిహద్దుల గుర్తింపులో ఎటువంటి తేడాలు లేకుండా చూడాలన్నారు. రైతులను దగ్గరే ఉంచి వారి పొలాల సరిహద్దులు గుర్తించి, చూపాలన్నారు.

ఘనంగా అవతార్ మెహర్‌బాబా జయంతి



అవతార్ మెహర్‌బాబా చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

రాజాం సిటీ: అవతార్ మెహర్‌బాబా జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక చీపురుపల్లి రోడ్డులోని మెహర్‌బాబా కేంద్రంలో ఈ వేడుకలు ఉదయమే ప్రారంభమయ్యాయి. నగర సంకీర్తనలతో పాటు మెహర్‌బాబా చిత్రపటాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా కేంద్రం అధ్యక్షుడు కొత్తా భాగ్యలక్ష్మి సప్తవర్ణ పతాకావిష్కరణ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, బాబా ప్రేమకు ప్రతి ఒక్కరూ పాత్రులు కావాలని, ఆయన సూక్తులను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి పీవీ శ్రీనివాసరావు, డి.రామప్పడు, శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

రాజాం సిటీ: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని సీఐ కె. రవికుమార్ అన్నారు. శనివారం స్థానిక చైతన్య పాఠశాలలో స్పోర్ట్స్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ఆర్‌ఎం వి.శ్రీనివాస్, డీన్‌లు హరిశ్రీను, సురేంద్ర, బుచ్చెంనాయుడు, ఏఓ ఎల్లంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల జోనల్ అధికారి త్రివిక్రమరావు

బొబ్బిలి రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఎన్నికల జోనల్ అధికారి, సమగ్ర భూముల రీసర్వే ఏడీ త్రివిక్రమరావు శనివారం పరిశీలించారు. రాజా కళాశాలలోని పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న ఏర్పాట్లను చూసిన ఆయన పక్కాగా పోలింగ్ జరిగేలా చూడాలని సిబ్బందికి సూచించారు. బొబ్బిలి,రామభద్రపురం పోలింగ్‌కేంద్రాలు పరిశీలించానని జోనల్ అధికారి తెలిపారు. బొబ్బిలిలో ఆరు, రామభద్రపురంలో ఓ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు.

విద్యాప్రగతికి కృషి చేయాలి

బొబ్బిలి: విద్యాప్రగతికి ఉపాధ్యాయులంతా కృషి చేయాలని డిప్యూటీ ఈఓ ఎన్.తిరుపతినాయుడు సూచించారు. స్థానిక ఓ ప్రైవేట్ కళాశాలలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో శనివారం సమావేశమైన ఆయన పాఠశాలల్లో విద్యాప్రగతి, విజ్ఞాన ప్రదర్శనలు, విద్యార్థుల విద్యాసామర్థ్యాలపై ఆరాతీశారు. అనంతరం ఆయన పాఠశాలల పనితీరు పక్కాగా ఉండాలంటే నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఆ తర్వాత పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పలు అంశాలపై అవగాహన కల్పించారు.

820 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి



మాట్లాడుతున్న సమగ్ర భూముల రీసర్వే ఏడీ త్రివిక్రమరావు

బొబ్బిలి రూరల్: జిల్లాలోని 820 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తయిందని సర్వే ఏడీ త్రివిక్రమరావు తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 3,842 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో సర్వే చేయాల్సి ఉండగా, ఇప్పటికే 2,797 చదరపు కిలోమీటర్లలో సర్వే చేయడం జరిగిందన్నారు. తొలి విడతలో 179 గ్రామాల్లో సర్వే పూర్తి చేశామని, రెండో విడతలో 279 గ్రామాల్లో సర్వే ప్రస్తుతం జరుగుతోందని పేర్కొన్నారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో శాశ్వత భూహక్కు పత్రాల పంపిణీ కూడా జరుగుతోందన్నారు. ఈ ఏడాది అక్టోబర్ నెల నాటికి భూముల రీసర్వే పూర్తి చేస్తామన్నారు.

నేటి నుంచి పైడితల్లి జాతర

- ఏర్పాట్లు పూర్తి
- భారీగా తరలిరానున్న భక్తులు



పోలిపల్లి పైడితల్లి అమ్మవారు



భక్తులు కోసం క్యూ లైన్లు

రాజాం /రాజాం సిటీ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పోలిపల్లి పైడితల్లి జాతరకు రంగం సిద్ధమైంది. 97వ వార్షికోత్సవ మహోత్సవంలో భాగంగా ఆదివారం నుంచి జరగనున్న జాతరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 24న నేత్రోత్సవం నిర్వహించగా 26 నుంచి జాతర ప్రారంభం కానుంది. మూడు రోజుల పాటు జరగనున్న జాతరకు శ్రీకాకుళం, విజయనగరం, బొబ్బిలి, విశాఖపట్నం, విజయవాడ, ఒడిశా, తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో రానున్నారు. ఈ ఆలయానికి ప్రభుత్వం 6ఏ హోదా కల్పించడంతో ఆ స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈఓ బీవీ మాధవరావు తెలిపారు. ఇప్పటివరకు డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారి పర్యవేక్షణలో ఈ ఆలయం ఉండేది. ఇటీవల దీనిని 6ఏ టెంపుల్స్ జాబితాలో చేర్చడంతో రీజనల్ జాయింట్ డైరెక్టర్ స్థాయి అధికారి పర్యవేక్షణలో ఉత్సవాలు జరగనున్నాయి. జాతర సందర్భంగా వివిధ రకాల దుకాణాలు, జెయింట్‌వీల్స్, సర్కస్‌లు ఇప్పటికే ఏర్పాటయ్యాయి. అమ్మవారి ఆలయ ప్రాంగణం నుంచి కిలోమీటర్ వరకు విద్యుత్ దీపాలతో అలంకరించారు.

సాంస్కృతిక కార్యక్రమాలు..

జాతరలో భాగంగా 26వ తేదీన ఎస్‌వీ రమణా కళా పరిషత్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర స్థాయి ఏకపాత్రాభినయ పోటీలు ఏర్పాటు చేశారు. అలాగే 27న ఉదయభాను కళాసమితిచే శ్రీరామాంజనేయ (యుద్ధసీను), రాజాం కళాసాగర్ వారిచే శ్రీ కాళహస్తీశ్వర మహత్మ్యం (భక్తకవి నత్కీర) పౌరాణిక పద్యనాటకం ప్రదర్శించనున్నారు. 28న అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి ఘటోత్సవంతో జాతర మహోత్సవం ముగుస్తుంది.

బాలికలందరికీ విద్య, ఆరోగ్యమే 'సఖి' లక్ష్యం



సఖి కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమావతి

మెంటాడ: కిశోరి బాలికలందరికీ నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్యం అందివ్వడమే సఖి కార్యక్రమ ప్రధాన లక్ష్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమావతి తెలిపారు. శనివారం మండలంలోని జయితి గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సఖి కార్యక్రమం, దాని లక్ష్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 9 నుంచి 21 ఏళ్ల వయసున్న బాలికలను ఓ గ్రూపుగా చేసి, ఓ మహిళా పోలీస్, ఏఎన్‌ఎం, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలతో పాటు ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలితో వారి విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించడమనేది సఖి కార్యక్రమం ద్వారా చేపట్టడం జరుగుతోందన్నారు.

జాతరకు సహకరించాలి

- 320 మంది సిబ్బందితో బందోబస్తు: సీఐ రవికుమార్



మీడియాతో మాట్లాడుతున్న సీఐ రవికుమార్

రాజాం సిటీ: పోలిపల్లి పైడితల్లి జాతరకు వచ్చే భక్తులు సహకరించాలని రాజాం టౌన్ సీఐ కె.రవికుమార్ కోరారు. శనివారం స్థానిక టౌన్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా 320 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేశామన్నారు. ఇద్దరు సీఐలతో పాటు 14 మంది ఎస్సైలు, 54 మంది ఏఎస్సైలు, హెచ్‌సీలు, 120 మంది కానిస్టేబుళ్లు, 16 మంది మహిళా పోలీసులు, 93 మంది హోంగార్డులతో పాటు రోప్ పార్టీలు, ఏఆర్ సిబ్బంది విధులు నిర్వహిస్తారని చెప్పారు. జాతరకు వచ్చే భక్తుల వాహనాలకు అనుమతిలేదని తెలిపారు. బొబ్బిలి జంక్షన్ మీదుగా వచ్చే భక్తులు తమ వాహనాలను పోలీస్ క్వార్టర్స్ వద్ద.. బొబ్బిలి వైపు నుంచి వచ్చే వాహనాలు మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న స్థలంలో.. అలాగే మెంటిపేట మీదుగా వచ్చే వాహనాలు ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద నిలిపివేయాలని సూచించారు.

ఏర్పాట్ల పరిశీలన

జాతర ఏర్పాట్లను దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ పీవీ లక్ష్మి పరిశీలించారు. అమ్మవారి గర్భగుడితో పాటు విశ్రాంత భవనం, క్యూలైన్లు, ఇతర ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఈఓ బీవీ మాధవరావు, తదితరులున్నారు.

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలి

- ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతు ఇస్తున్న అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు కోరారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఆయన విశాఖపట్నం రాజధాని కావాలన్న ఆకాంక్షకు బలం చేకూర్చేలా వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థికి తొలి ప్రాధాన్య ఓటు వేసి, భారీ మెజార్టీతో గెలించాలన్నారు. 40 ఏళ్ల సీనియారిటీ అని చెప్పుకునే చంద్రబాబు ఎప్పుడైనా వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి గురించి ఆలోచించారా అని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ పార్టీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు, పాలసొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ భాస్కరరావు

బొబ్బిలి రూరల్: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి, వారి సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీఓ అల్లు భాస్కరరావు సచివాలయ సిబ్బందికి సూచించారు. మండలంలోని దిబ్బగుడ్డివలస గ్రామ సచివాలయాన్ని శనివారం సందర్శించిన ఆయన అక్కడి రికార్డుల నిర్వహణ, ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. అర్హులకే పథకాలు అందేలా చూడాలన్నారు. ప్రజల సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు.

బాలల చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సౌమ్య

బాడంగి: స్థానిక అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో బాలల చట్టాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బొబ్బిలి సివిల్ కోర్టు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జె.సౌమ్య బాలల హక్కుల ద్వారా బాలలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే బాలికలను వేధిస్తే పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, కఠిన శిక్ష వేస్తారని తెలిపారు. పిల్లలంతా చక్కగా చదువుకుని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

గ్రామసభ

బొబ్బిలి రూరల్: సమగ్ర భూముల రీసర్వేపై మండలంలోని గొర్లెసీతారాంపురం గ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎన్.రాజారావు 9(2) నోటీసుల పంపిణీపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అలాగే సర్వే జరుగుతున్న తీరుపై ప్రజాభిప్రాయం సేకరించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్ డీటీ జి.అప్పయ్య, సర్పంచ్ జి.ఈశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సజావుగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ గౌరి, జెడ్పీటీసీ రామారావు తదితరులు

బాడంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం సజావుగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకురాగా, ఆ సమస్యలను పరిష్కరిస్తామని అధికార పార్టీ సభ్యులు హామీ ఇచ్చారు. దీంతో పాటు ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం, ఉగాదికి జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల పూర్తి వంటి అంశాలపై సభలో చర్చ జరిగింది. సమావేశంలో ఎంపీపీ భోగి గౌరి, జెడ్పీటీసీ రామారావు, పంచాయతీరాజ్ డీఈఈ అప్పారావు, ఏఓ శిరీష, వైస్ ఎంపీపీ బి.రమేష్, ఎంపీడీఓ అక్కారావు తదితరులు పాల్గొన్నారు.